క్లుప్తంగా

జాబ్ కార్డు ఉన్న వారందరికీ ఉపాధి


మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: జాతీయ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు కలిగిఉన్న వారందరికీ పనులు కల్పిస్తామని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి అన్నారు. ఆయన బుధవారం తడకనపల్లె, పెద్దటేకూరు గ్రామాల్లో జరుగుతున్న ఫీడర్ చానల్ పనులను పరిశీలించారు. అనంతరం మస్టర్లను తనిఖీ చేసి, జరుగుతున్న పనుల గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేస్తే పూర్తి వేతనం పొందవచ్చని చెప్పారు. కూలీల సంఖ్య పెంచాలని ఆయా గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఏపీఓ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. బుధవారం మద్దూరు గ్రామంలోని పీహెచ్‌సీలో ఎంపీపీ ఉసేన్‌బీ ఆధ్వర్యంలో హెచ్‌డీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరగాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మంచి వైద్య సేవలు అందించి మన్ననలు పొందాలన్నారు. నిత్యం వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ అభిషేక్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న లారీ



పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద జాతీయ రహదారిపై ఓ ట్రాలర్ లారీ ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. హైవే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల నుంచి కర్నూలుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక వస్తున్న లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఎక్కి బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ సమస్య పరిష్కరించారు.

జెడ్పీ సీఈఓ తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కల్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులు, రిజిస్టర్లు, రిపోర్టులు, రికార్డులను భద్రపరచు గదిని పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. గ్రామ సచివాలయాలను, అందులో పనిచేస్తున్న ఉద్యోగులను పర్యవేక్షించాలన్నారు.ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండల మీట్ మళ్లీ వాయిదా

గడివేముల: మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం కోరం లేకపోడంతో రెండో రోజు వాయిదా పడింది. ఈనెల 28వ తేదీన జరగాల్సిన సమావేశాన్ని ఎంపీటీసీలు ఎవరూ రాకపోవడంతో ఎంపీడీఓ వాసుదేవ గుప్తా బుధవారానికి వాయిదా వేశారు. మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే సమావేశ మందిరానికి చేరుకున్నారు. అయితే మండలంలోని 13 మంది ఎంపీటీసీలు రాకపోవడంతో గంటల తరబడి వేచి చూశారు. ఎంతకు ఎంపీటీసీలు రాకపోవడంతో మరోసారి సమావేశాన్ని వాయిదా వేశారు. ఎంపీటీసీలకు అధికారులు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో పాటు ప్రొటోకాల్ పాటించడం లేదని, అందుకే సర్వసభ్య సమావేశానికి హాజరుకావడం లేదని ఎంపీటీసీలు చెబుతున్నారు.

ఆధార్ శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలి

సి.బెళగల్: గ్రామ సచివాలయాల్లో షెడ్యూల్ ప్రకారం ఆధార్ శిబిరాలను పకడ్బందీగా చేపట్టాలని కర్నూలు డివిజన్ లెవల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) రమణారెడ్డి సూచించారు. ఆయన బుధవారం మండల పరిధిలోని పోలకల్ గ్రామ సచివాలయాలు 1, 2, 3లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయం నిర్వహణ, గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజా సేవలను పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ.. వారంలో ఆధార్ సర్వీస్‌లను రెగ్యులర్‌గా నిర్వహించాలన్నారు. ఈ మేరకు మండల అధికారులు సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ–పేమెంట్స్‌ను ప్రభుత్వానికి జమ చేయాలి

పోలకల్ సచివాలయం తనిఖీ అనంతరం మండల కేంద్రం సి.బెళగల్‌లోని మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని అధికారులతో మాట్లాడారు. సచివాలయాల్లో చేపడుతున్న ఈ–సర్వీస్‌ల పేమెంట్లను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలని సూచించారు. ఈ మేరకు మండల అధికారులు, డీడీఓలు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వం చేపట్టిన మిస్సింగ్ సిటిజన్, ఎన్‌పీసీఐ, ఆధార్ నమోదు, నాన్ రెసిడెన్సీ ఆఫ్ ఏపీ, జియో మ్యాపింగ్ తదితర సర్వేలలో మండలం వెనుకబడి ఉందని, ప్రభుత్వ ఉద్యోగులందరు బాధ్యతాయుతంగా పనిచేసి, సర్వేలను సకాలంలో పూర్తి చేయించాలని డీఎల్‌డీఓ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఏఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి ఇతర అధికారులు ఉన్నారు.


పోలకల్ సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ రమణారెడ్డి

■ విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కోడుమూరు రూరల్: గ్రామ సచివాలయ సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీఎల్‌డీఓ రమణారెడ్డి హెచ్చరించారు. ఆయన బుధవారం గూడూరు మండలంలోని కె.నాగలాపురం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించడంతో పాటు, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం సూచించిన సర్వేలను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. 0 – 6 సంవత్సరాల్లోపు చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. గూడూరు ఎంపీడీఓ శివనాగప్రసాద్ వెంట ఉన్నారు.

మద్దతు ధరతో కందుల కొనుగోలు

గడివేముల: మండలంలో కంది పంటను సాగుచేసిన రైతులు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరకు దిగుబడులను విక్రయించేందుకు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని ఏఓ హేమసుందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. నంద్యాల ఏపీ మార్కెట్ ద్వారా కింటా రూ.7550 ప్రకారం కందులను కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ నెల 31వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఖాళీ స్థలాల్లో వ్యర్థాలను వేయొద్దు

కర్నూలు (టౌన్): నగరంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో వ్యర్థాలను వేయొద్దని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ప్రజలను కోరారు. బుధవారం కొండారెడ్డి బురుజు సమీపంలోని పూలబజార్ వెనుక ప్రాంతంలో వ్యర్థాలను కమిషనర్ పరిశీలించారు. వ్యర్థాలను వెంటనే శుభ్రం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ మనోహర్ రెడ్డి ఉన్నారు.

ఉపాధి కూలీలకు కనీస వేతనం కల్పించండి


కూలీలతో మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారులు

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కనీసం వేతనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఏపీడీ లక్ష్మన్న సూచించారు. ఆయన బుధవారం మండలంలోని లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ కుమార్‌సాయినాథ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూలీలకు సరిపడా పనులను కల్పించి, కనీసం వేతనం అందేలా చూడాలన్నారు. కొలతల ప్రకారం పనిచేయించి, ప్రతి ఒక్కరికీ కనీసం వేతనం రూ.300 వచ్చేలా పనులు చేపట్టాలన్నారు. అనంతరం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సిబ్బంది నిర్లక్ష్యం వీడి కూలీలను చైతన్యపరచి అధిక సంఖ్యలో పనులకు వచ్చేలా చూడాలన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిదే అన్నారు. పనుల వద్ద ఈఎస్ఎస్ఎంఎస్, డి.మస్టర్లను అప్‌లోడ్ చేయాలని సూచించారు. సాంకేతిక సిబ్బంది గ్రామాలలో గ్రూపు సమావేశం నిర్వహించి, అధిక మందికి పనులు కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, ఈసీ పెంచలయ్య, టీఏలు శాంతి, మధుశేఖర్, భూపాల్, ఆయా గ్రామాల ఎఫ్‌ఏలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయంలో యాంత్రీకరణ పాటించాలి


వ్యవసాయ పథకాలను తెలియజేస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులు వ్యవసాయంలో యాంత్రీకరణ పద్ధతులను పాటించాలని, ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్ కుమార్ అన్నారు. ఆయన బుధవారం మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి గ్రామ సచివాలయ ఆవరణలో రైతులతో సమావేశం నిర్వహించి ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. సూక్ష్మ సేద్యంలో భాగంగా ఉద్యానవన శాఖ ద్వారా ఐదెకరాలలోపు వ్యవసాయ పొలాలు ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీపై యంత్రాలను అందజేయడం జరుగుతుందని, ఆసక్తి ఉన్న రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఈఓ హిమబిందు, వీహెచ్ఏ రాజు, ఎంఈఈఓలు భాస్కర్, వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.

పాలకులను నమ్మలేక.. ప్రయాణికుల అవస్థలు చూడలేక


నంద్యాల-నందికొట్కూరు రోడ్డుపై గుంతలను పూడ్చుతున్న కరీముల్లా

గడివేముల: పాలకులు వస్తారని.. ఏదో చేస్తారని వేచి చూడకుండా, గతుకుల రోడ్డుపై ప్రయాణికులు పడుతున్న అవస్థలను చూడలేక రహదారిపై పడిన గుంతలను స్వచ్ఛందంగా పూడ్చేందుకు ఓ యువకుడు నడుం బిగించారు. నంద్యాల – నందికొట్కూరు ప్రధాన రహదారిలో భారీ వాహనాల రాకపోకలు సాగించడంతో గడివేముల పొలిమేర చింతమాను దగ్గర రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా గుంతలు పడ్డాయి. నిత్యం ఈ రహదారిలో వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ముఖ్యంగా రాత్రి వేళలో బైకులపై వెళ్లే వాహనదారులకు గుంతలు కనబడక ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. దీంతో బుధవారం బిలకలగూడూరుకు చెందిన కరీముల్లా మట్టిని తీసుకొచ్చి గుంతలను పూడ్చారు. గుంతలు పూడ్చిన కరీముల్లాను వాహనదారులు, గ్రామస్తులు అభినందించారు.

పొగాకు కంపెనీలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ఓర్వకల్లు: రైతులను నట్టేట ముంచుతున్న పొగాకు కంపెనీలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని నన్నూరు గ్రామంలో పర్యటించి పొగాకు రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎంతో వ్యయప్రయాసలు పడి, పొగాకు దిగుబడులను ఆయా కంపెనీల వద్దకు తీసుకొస్తే, కొనుగోలుదారులు మాత్రం తమకు ఇష్టంవచ్చినట్లు ధరలు వేసి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. రైతులు ప్రశ్నిస్తే ఇక నుంచి తమ కంపెనీకి పొగాకు తీసుకురావొద్దంటున్నారని వాపోయారు. ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చుపెట్టి పొగాకును పండిస్తే, వివిధ కారణాలతో ధర తగ్గిస్తూ నష్టాలకు గురిచేయడం దారుణమన్నారు. సాగుకు ముందు క్వింటాల్ రూ.16 వేల నుంచి రూ.18 వేలకు కొనుగోలు చేస్తామని నమ్మబలికి, తీరా పంటలు కోతదశకు వచ్చిన తర్వాత ధర తగ్గించడం అన్యాయమన్నారు. పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని, లేదంటే రైతులను కూడగట్టి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, రైతు సంఘం మండల కార్యదర్శి మధుసూదన్, కల్లూరు మండలం రైతు సంఘం నాయకులు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఏఓ రూఫస్‌రొనాల్డ్

కర్నూలు(రూరల్): వేరుశనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా అధికారిణి ఎల్.వరలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని రేమట గ్రామంలో బుధవారం కర్నూలు మండల ఏఓ రూఫస్ రొనాల్డ్ అధ్వర్యంలో నిర్వహించిన ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక రైతులతో కలిసి క్షేత్ర స్థాయిలో వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ.. తెగుళ్లకు నివారణకు క్షేత్రస్థాయి అధికారులు సూచించిన మోతదు లో మందులు వినియోగించాలన్నారు. అధికంగా మందులు పిచికారీ చేయడం వల్ల పెట్టుబడి ఖర్చు పెరుగుతుందే తప్పా ప్రయోజనం ఉండదన్నారు. సస్యరక్ష్యణతో చర్యలతో తక్కువ పెట్టుబడితో అధి క లాభాలు పొందవచ్చన్నారు. అలాగే ఖరీఫ్‌లో కంది పంట సాగుచేసిన రైతులు దిగుబడులను మద్దకు ధరకు విక్రయించేందుకు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కందులను క్వింటాలు రూ.7,550 ప్రకారం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. వ్యవసాయ విస్తరణ అధికారి మోహన్ రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది సుధీర్‌కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్ దురుసు ప్రవర్తన

గడివేముల: బ్యాంకులో లోన్‌కు సంబంధించి సమస్యను వివరించేందుకు బ్రాంచ్ మేనేజర్‌ను కలవగా ‘నా సమయం వృథా చేయొద్దు. అసలు మా బ్యాంకుకే రావొద్దు’ అని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు బాధితుడు వాపోయాడు. వివరాలు.. గడివేములకు చెందిన షేక్ చాంద్ బాషాకు భార్య షేక్ హఫీజ్‌కు గత ఏడాది జూన్ నెలలో ముద్ర లోన్ కింద రూ.2 లక్షలు లోన్ మంజూరు చేయడానికి స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌లో లోన్ అకౌంట్ నంబర్ (43050719029)ను ప్రారంభించారు. గతంలో పనిచేసిన మేనేజర్ సర్వర్ పనిచేయడం లేదని చెబుతూ మంజూరైన అమౌంట్‌ను ఖాతాలో జమ చేయలేదు. నగదు ఖాతాలో జమ కాకపోవడంతో లోన్ మంజూరు కాలేదేమోనని మిన్నకుండిపోయారు. ఈ స్థితిలో బుధవారం లోన్ రికవరీ ఫీజు రూ..2606 చెల్లించాలని మెసేజ్ వచ్చింది. నాకు లోనే రాలేదు ఫీజు ఎందుకు చెల్లించాలని ప్రస్తుత ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌ను అడగగా.. మేసేజ్‌లో తెలిపిన అమౌంట్‌ను చెల్లించి, గత మేనేజర్ వద్దకు వెళ్లి అడగండని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. ఈ విషయంపై స్టేట్ బ్యాంకు రీజనల్ మేనేజర్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు చెప్పారు.

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి


ప్రశంసా పత్రాలు అందుకున్న మహిళలతో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

పాణ్యం: మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు తీసుకొని ఉపాధి అవకాశాలను పెంచుకోవాలని నంద్యాల జిల్లా డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఆయన బుధవారం పాణ్యంలోని పొదుపు కార్యాలయంలో డీఆర్‌డీఏ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్న మహిళలు స్వయంగా ఉపాధి పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించుకొని పేదరికం నుంచి బయటపడొచ్చన్నారు. బ్యాంకులలో తీసుకున్న రుణాలకు సకాలంలో వాయిదాలు చెల్లించి బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎల్‌డీఎం రవీంద్రబాబు, స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఏపీఎం ప్రసాద్, డీపీఎం బాబు, ఎల్లయ్య, సీసీలు, సమాఖ్య కార్యదర్శి మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే అధిక వేతనం


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ మధుబాబు

కర్నూలు(రూరల్): ఉపాధిహామీ పథకం కింద పనులు చేసే కూలీలంతా నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయలని మండల ఏపీఓ మధుబాబు సూచించారు. బుధవారం ఈ.తాండ్రపాడు గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పథకాన్ని ఏపీఓ పరిశీలించారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనిచేస్తే రోజువారీ వేతనం రూ.300 వరకు వస్తుందని, కూలీలంతా ఉదయన్నే పనుల్లోకి వెళ్ళి మధ్యాహ్నం 12లోగా పనులు ముగించుకోవాలని సూచించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, ఎవరి పేరు ఉంటే వారే పనుల్లోకి రావాలన్నారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే ఉపాధి పనులు కల్పిస్తామన్నారు

తమ్మరాజుపల్లెలో చోరీ

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో చోరీ జరిగింది. బుధవారం గ్రామానికి చెందిన సువర్ణ అనే మహిళ ఇంట్లో చొరబడ్డ దొంగలు బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రెండు తులాల బంగారు. రూ.11 వేల నగదును దొంగిలించారు. వ్యవసాయ పనులు ముగించుకొని వచ్చిన ఆమె ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. బీరువా పగులగొట్టి అందులో ఉంచిన బంగారు, నగదును దుండగులు చోరీ చేసినట్లు గుర్తించారు. ఘటనపై బాధితురాలు పాణ్యం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అన్ని దానాల్లో అన్నదానం మిన్న


శివస్వాములకు ఆహారం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అన్ని దానాల్లో అన్నదానం మిన్న అని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని దేవనగర్‌లో ఉన్న శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ జనరల్ సెక్రటరీ ఎ.హనుమంతురెడ్డి శివ దీక్షాదారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం శివ దీక్షా స్వాములకు అన్నదానం చేశారు. కార్పొరేటర్లు, పార్టీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, శివ దీక్షా స్వాములు పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: మండలంలోని రైతులు తగిన మెలకువలు పాటిస్తూ రబీ సీజన్‌లో సాగు చేసిన పైర్లను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. బుధవారం మండలంలోని గోరంట్ల గ్రామంలో ఏఓ రవిప్రకాష్ వేరుశనగ, మొక్కజొన్న సాగుపై ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. వేరుశనగ పైరు సాగు చేసిన 50 రోజుల తర్వాత ఆకుమచ్చ తెగులు సోకేందుకు అవకాశాలున్నాయని, తెగులు నివారణకు హెక్సాకజోల్ లేదా ప్రోపికనజోల్ 200 ఎంఎల్ పిచికారీ చేసుకోవాలన్నారు. వేరుశనగ పంట పెరుగుదల కోసం 13–0–45ను ఎకరానికి కిలో చొప్పున వాడాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పండించిన కందులను ప్రభుత్వం క్వింటాల్ రూ.7550 ప్రకారం మద్దతు ధరపై కొనుగోలు చేస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సూచించారు. ఏఈఓ బాలకృష్ణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ప్రదీప్, రాజేష్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనిదినాల సంఖ్య పెంచాలి


ఉపాధి కూలీల సమస్యలపై చర్చిస్తున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కోడుమూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వంద రోజుల పనిదినాలు పూర్తిచేసుకున్న పాధి కూలీలకు అదనంగా మరో 100 రోజుల పని దినాలు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. గూడూరు మండలంలోని కె.నాగలాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ.. ప్రతి రోజు ఉపాధి పనులు చేస్తున్నా వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. వారానికోసారి కూలి తప్పనిసరిగా చెల్లించాలని, 100 రోజులు అదనపు పనిదినాలు కల్పించాలని కోరారు. ప్రతి రోజు పనులు చేసేవారికి పే స్లిప్‌లు ఇవ్వాలని కోరారు. నారాయణ మాట్లాడుతూ.. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలను త్వరగా మంజూరు చేయాలని, లేకపోతే కూలీలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్, స్థానిక నాయకులు ఎర్రమల, రవి తదితరులు పాల్గొన్నారు.

కిల్కారీ కాల్స్‌పై అవగాహన


కిల్కారీ పోస్టర్ విడుదల చేస్తున్న డాక్టర్ సునీత

పాణ్యం: స్థానిక సీహెచ్‌సీలో బుధవారం ఏఎన్ఎం, ఆశాలకు కిల్కారీ కాల్స్‌పై అవగాహన కల్పించారు. మద్దూరు పీహెచ్‌సీ డాక్టర్ సునీత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 4 నెలల గర్భవతి నుంచి బాలింతల వరకు కిల్కారీ కాల్స్‌పై అవగాహన కల్పించాలరు. 4 నెలల గర్భవతి మొదలుకొని 72 వారాల వారికి ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ వస్తాయన్నారు. ఈ ఫోన్ కాల్స్‌లో గర్భిణులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎప్పుడు పరీక్షలు చేయించుకోవాలి, ఎక్కడ చేయించుకోవాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలనే విషయాలపై రెండు నిమిషాల ఫోన్ కాల్స్ వస్తాయన్నారు. అలాగే బాలింత అయితే బిడ్డకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఏ సీజన్‌లో ఎలాంటి జాగ్రత్తలు పాటిస్తే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందనే విషయాలను తెలియజేస్తారన్నారు. ఈ విషయాన్ని ఏఎన్ఎంలు, ఆశాలు గర్భవతులకు, బాలింతలకు తెలియజేయాలన్నారు. అనంతరం కిల్కారీ పోస్టర్లను విడుదల చేశారు. ఎంపీహెచ్ఈఓ సుబ్బారెడ్డి, ఆశాల నోడల్ అధికారి కీర్తి, డీపీహెచ్ఎన్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కోడుమూరు రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కోడుమూరు నియోజకవర్గ వివిధ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన జారీ చేసింది.

వింగ్	ప్రెసిడెంట్		
యూత్ వింగ్	ఎంకె.వెంకటేష్	గ్రీవెన్స్ సెల్	ముదుమలగుర్తి విక్రమ్ సింహారెడ్డి
మహిళా విభాగం	ఫైలా జ్యోతి	వాణిజ్య విభాగం	వినయ్ కుమార్‌రెడ్డి
రైతు విభాగం	నరసింహులు	వీవర్స్ వింగ్	లింగమూర్తి
బీసీ సెల్	జింకల కుమార్	వైఎస్సార్‌టీయూసీ	బోయ వెంకటేష్
ఎస్సీ సెల్	అతెపోగు బొజ్జన్న	అంగన్‌వాడీ వింగ్	దానమ్మ
ఎస్టీ సెల్	ఎరకలి పెద్ద వీరన్న	లీగల్ సెల్	సత్యనారాయణరెడ్డి
మైనార్టీ సెల్	ఎస్.బందె నవాజ్	కల్చరల్ వింగ్	గుజరాతి ప్రవీణ్‌కుమార్
మున్సిపల్ వింగ్	సి.సాంబశివరావు	సోషల్ మీడియా వింగ్	కురువ గిరిప్రసాద్
పంచాయతీ రాజ్ వింగ్	మౌలాలి	బూత్ కమిటీలు	జి.లక్ష్మికాంతారెడ్డి
పబ్లిసిటి వింగ్‌పోరెడ్డి	వెంకటేశ్వరరెడ్డి	దివ్యాంగుల విభాగం	బోయ మునెప్ప
ఆర్‌టీఐ వింగ్	జగదీష్ బాబు	డాక్టర్స్ వింగ్	మొల్ల హరూన్
వలంటర్స్ వింగ్	శెట్టి బలిజ మల్లికార్జున	ఇంటిలెక్చువల్స్	రవీంద్రరెడ్డి